జయలక్ష్మి దినచర్య

కాళహస్తి పాపయ్యా దేవరగారు

ప్రత్యూషకాలమందమలయవాయువు చల్లచల్లగావీచుచు జయలక్ష్మిని మేలుకొల్పెను. లేచి కాలకృత్యములుదీర్చుకొని, కుంకుమతిలకముపెట్టుకొని, ధవళవస్త్రములుధరించి, గృహకృత్యములుదీర్ప మొదలిడెను. మున్ముందు కల్లాపుజల్లి ముగ్గులుపెట్టెను ఇంతలో బిడ్డలులేచిరి వారందరికి ముఖప్రక్షాళనగావించి, స్నానముచేయించి, శుభ్రమైన వస్త్రములుకట్టనిచ్చి, వంటశాలకేగి, భర్తకు కాఫీఅలవాటుగాన, కాఫీ, ఉప్మాలు తయారుగావించి, అలవాటైన పెద్దకుమారుడు ప్రభాకరునకు, రెండవవాడు సుబ్బరాయునకు కాఫీ వుప్మాలుపెట్టి బడికిఅంపివేసెను పిమ్మట ఒక పెద్దగ్లాస్‌తో కాఫీయు పెరటిలోయున్న అరిటాకు కోసితెచ్చి, జలముచే శుభ్రపరచి, అందు ఉప్మాయుంచి, వసారాలో ఒకకుర్చీయందు అసీనుడైయున్న భర్తకడకేతెంచి ముందిడెను పిమ్మట భర్తతో 'యేమండి? మీకుజీతము హెచ్చించెదరు అనిచెప్పేరు. యింకను జేయలేదా?' యనిప్రశ్నించెను భర్తయగు మాధవరావు చేయుచున్నపని నావలనుంచి 'ఔను పైయధికారికి నాయందు అమితానురాగముగలదు. ఈనెలలో జేసెదనని జెప్పినాడు' అనెను.

జయలక్ష్మి 'చూడండీ, చూడండీ కాఫీ చల్లారిపోతుందెమొ తీసుకొండి' యని మరల వంటశాలకేగి తనకుమార్తె సరళకు కాఫీ మున్నుగునవియిచ్చి కొంత తానుతీసుకొనెను. తరువాత భర్తకడకేతెంచి యీపూట యేకూర వండమంటారండి యనిఅడిగెను. మాధవరావు నవ్వుచు నీకు నచ్చినకూరవండుము అని బట్టలు ధరించి ఆఫీసుకు వెళ్ళుచుండెను నిన్న మీరు చాలాఆలస్యముగావచ్చేరు ఈరోజున త్వరగారావలయునుమండియని నెమ్మదిగాఅనెను జయలక్ష్మి అలాగునచేయని తలఊపుచు వెడలిపోయెను భర్త మరల జయలక్ష్మి తనకుమార్తెతో వంటశాలకేగి మధ్యాహ్నపాకములు తయారుగావించుచుండెను భర్తకు చిక్కుడుకాయలన్న మహాయిష్టము పెరటిలోనికివెళ్ళి కొన్నిచిక్కుడుకాయలు కోసికొనిరమ్మ అని సరళనుపంపెను సరళజని అపూటకువలయు చిక్కుడుకాయలకోసితెచ్చి జననికిఇచ్చెను చిక్కుడుకాయలు, ములక్కాడలు తరిగి శాకములు తయారుగావించెను పెద్ద కుమారుడగు ప్రభాకరునకు కందిపప్పుయనిన యిష్టమని కందిపప్పు తయారుగావించెను ఇంతలో బడిలోనుండి పిల్లలేతెంచిరి కళకళమంటు గృహమున్నది. కొంతవడికి మాధవరావు ఆఫీసునుండివచ్చెను జయలక్ష్మి భర్తకు పిల్లలకు వకేసారివడ్డించెను. భర్తకు చిక్కుడుగింజలు యేరి వడ్డించెను అదిజూచి సుబ్బారాయుడు ఆ ఆ నాన్నకు ఎక్కువగింజలు వడ్డించేవు అని అనెను. కాదురా యవియనిన వారికిష్టము. నీకు రేపుయెక్కువ వడ్డించెదనులే యని సమాధానముచెప్పినను వినినవాడు కాడు నాన్నయెక్కువేంటి నాకు అన్నీపెట్టితేగాని నేను భోజనముచేయను అనెను మాధవరావు సుబ్బారాయుని గడుసుదనమునకు చిరునవ్వునవ్వుచు తనకువడ్డించినవాటిలో కొన్ని సుబ్బారాయునకిచ్చెను. మజ్జిగ యీవేళ గొల్లది మంచిదియిచ్చినదికాదండీ యనుచు అందు నిమ్మకాయలరసంపిండుచు మహాత్ముడు నిమ్మకాయలను చాలాప్రేమిస్తాడు అంటు ఆచల్లని అమృతముగామార్చి అందరకువడ్డించెను తృప్తిగాభుజించి మాధవరావు ఆఫీసుకువెడలిపోయెను. పిల్లలు బడికివెళ్ళిరి చిన్నపిల్లవానికి నిద్రవచ్చుటచే నతనిని పరుపుపై పరుండబెట్టి కూతురును తానును భోజనముజేసి కొంతసేపు పరుండెదమని వసారలోచాపవైచి పరుండబోయి గంపంతపని యింటనుండ సోమరిపోతువోలెపరుండుట యేమనిఅనుకొని కూతురు సాయమున కొంతసెనగపిండి విసిరి ఆఫీసులో అలసి పనిజేసివచ్చుభర్తకు ఫలహారముజేయుతలంపుతో త్వరితగమనమున కొన్నివడలు తయారుగావించెను సాయంకాలము నాలుగైనది పిల్లలు బడినుండియేతెంచినారు వారికికొన్నిపెట్టిభర్తకుకొన్నితీసి సిద్ధముజేసి భర్తకొరకు ఎదురుజూచుచుండెను వీధిలో సుబ్బారాయుడు తనయీడుపిల్లలను జేరదీసి

ఆవీధిలోనున్న పెద్దదూలమును తిరుగద్రోయుటకు ప్రయత్నించుచుండెను. ఇంతలో అతని చిన్నసోదరుడు ఆరేండ్లబాలుడు ఆదూలముపైకూర్చుండెను ఇతరబాలు రెంత జెప్పినను లేవలేదు ఈవినోదములన్నియు వ్యర్థములని తలపోయుతమ్ముని గాంచి ఉగ్రుడై సుబ్బారాయుడు వెంటనే దిగెదవాలేదాయని గద్దించెను ఆ బాలుడు ఆదూలముమీదనే కొంతదూరముజరిగి కూర్చుండెను సుబ్బారాయుడు ఇతరబాలురయెదుట తన పెద్దతనము గన్పరుప దూలముతిరుగద్రోయమనెను. దూలముపైగూర్చున్నబాలుడు దగినతనఆత్మగౌరవమునకు లోపమువచ్చునేమెయని కాబోలు కదలక బిగిసికూర్చుండెను అంతబాలురు తమశక్తికొలది ఆదూలమును తిరుగద్రోసిరి దూలముదొర్లిపోయెను. బాలుడువెనుకకుపడెను తోడనేలేచి యేడుస్తూ గృహముప్రవేశించెను. జయలక్ష్మి భర్తకొర కెదురుజూచుచుండెను. ఇంతలో యీరోదనధ్వనివిని వీధిద్వారముచెంతకు వచ్చెను. జరిగినదంతయు నడిగితెలుసుకొనెను సుబ్బారాయుడు నచ్చటనేయుండుటచే బాలుడునంతయు తల్లికిచెప్పెను జయలక్ష్మి సుబ్బారాయునివీక్షించి యిది నిజమేనాయని యడిగెను ఆకొంటెపిల్లవాడు కాదమ్మా మేమాడుకొనుచుండ మామధ్యకువచ్చి మాయాటచెరిపి పైగాదూలముమీదనుండి మామీదకు దుమికిపడెను అని అనృతమాడెను వీరిరువురమాటలువిని సుబ్బారాయుని మాటలందు నమ్మకములేక బాలుని మాటలందు నమ్మకమున్నదని గ్రహించి యిద్దరిని లోనికితీసుకువెళ్ళి బాలునికి రెండువడలు సుబ్బారాయునికి ఒకవడయునిచ్చి సుబ్బారాయునితో ఎన్నడు అనృతమాడవద్దు అనృతమాడిన కష్టములపాలయ్యెదవు అని బుజ్జగించెను ఇంతలో మాధవరావు గృహముప్రవేశించెను సరళ పాదప్రక్షాళనకై నీళ్ళిచ్చెను పాదప్రక్షాలనగావించుకొని వసారాలోఉన్న నొకకుర్చీపై అబ్బాయనుచు నిట్టూర్పువిడుచుచు కూర్చుండెను చిన్నబాలుడు "నాన్నా! నాన్నా!" యని చెంతకుజేరెడు. జయలక్ష్మి లోనికేగి భర్తకు ఫలహారముదెచ్చి ముందిడెను అచ్చటనేయున్న నొకచిన్నబల్లపై నాసీనుడైన మాధవరావు ఫలహారమునుగాంచి ఓహో! యీరోజున క్రొత్తరకముపండేవేయని తినుట ప్రారంభించెను ఇంతలో సుబ్బారాయు డెచ్చటనుండియో పర్వెత్తుకువచ్చి నాన్న, అమ్మనాకు చాలాతక్కువబెట్టెను అనెను. ఆ నీకు తక్కువపెట్టెనాయని నవ్వుచు వానికొకటి యిచ్చెను ఇదివినుచుండిన జయలక్ష్మి యేమిరా! అల్లరిపిల్లవాడు, నీకు నేను తక్కువపెట్టినానా యని దగ్గరకుజేరదీసి బుగ్గలునులిమెను ప్రభాకరుడు యేవోపుస్తకములు చదువుకొనుచు ఒకయెడకూర్చుండెను. సరళ జనకుడు సంపాదించినకదా మనమింత తినునది యని అనుకొను స్వభావముగలబాలిక గుణములకుప్ప. ఎల్లప్పుడు జననికిచేదోడై యింటిపనులయందు కొంతభాగము నిర్వర్తించెడిది పన్నెండేండ్లబాలిక. నావల గదిలో తమ్ములచొక్కాలు కుట్టుచుండెను సూర్యభగవాను డస్తాద్రికేగుచుండెను ఆసమయమున ఆగదియందు మాధవరావు జయలక్ష్మిమాత్రముండిరి. వారిట్లు సంభాషింపదొడంగిరి

జ—ఏమండీ! అమ్మాయికి వివాహవయసు పైబడుచుండెను వివాహప్రయత్నము జేయరేమండీ?

మా—అప్పుడే తొందరేమి? చూడు చిన్నతనములో వివాహముజేసినందువలన బాలవితంతువు లెందరుండిరో! పాపము వారిగతియేమియొగదా? మనమ్మాయికి రజస్వలానంతర వివాహముగావించెదము దైవమున్నాడు వాని కెప్పుడుదోచిన అప్పుడే జరుగును తొందరయేమి?

జ—ఏమండీ! దైవమందురేమి? మనము కార్యమందుదిగకున్న దైవమువచ్చిచేయునా?

మా—ఓపిచ్చిదాన! మనపూర్వజన్మార్జితపుణ్యాపాపకర్మలకే దైవమనినామము అది మానవుల మంచిచెడ్డలకు, సుఖదుఃఖములకు, అదృష్టదురదృష్టములకు గారణము. బండిచక్రమువలె కర్మబద్ధుడైన ప్రాణియు, పూర్వకర్మవాసననుబట్టి ఒకప్పు డత్యున్నతస్థితిని, మరియొక్కప్పుడు నీచస్థితినిగాంచును. మనకు తెలియకుండగనే దైవ ముచ్చనీచస్థితులను దెచ్చిపెట్టుచుండును. మనగృహమునగల పంజరములోఉన్నచిలుక మన

కొట్టుపోతలకులోనై చూచుచుండునట్లు దైవముగల్గించుచున్న సుఖదుఃఖములకు, హృదయపూర్వకముగా తీసుకొని అనుభవించవలెను. తప్పించుకొన మనశక్యముగాదు

జ—నిజమేనండీ. దైవముపై భారము వేస్తూ మనప్రయత్నముండవలయును, కాదండి.

మా—ఔను. నిజమే

ఇంతలో సంజెచీకట్లు అలుముకొనజొచ్చెను జయలక్ష్మి సరళతో లాంపులువెలిగించమనిజెప్పి వంటశాలకేగి భోజనపదార్థములన్నియు నొకగంటకాలములో తయారుగావించెను. బాలుడు అమ్మా! అన్నము పెట్టవేయని తల్లిచెంతకుజేరెను. వెంటనే బాలురకువడ్డించి చిన్నపిల్లవానికి అన్నముతినిపించి పరుండబెట్టెను. పిమ్మట భర్తకు, కూతునకు భోజనమువడ్డించి తను యింతతిని వంటగృహమున అన్నియు చక్కబెట్టుకొని రాగిచెంబుతో జలముతీసికొని తమలపాకులపెట్టెతో శయ్యాగారమున ప్రవేశించెను మాధవరావు యేవో ఆఫీసు కాగితములు వ్రాసికొనుచుండెను జయలక్ష్మి నొకబల్లపైకూర్చుండి తమలపాకులకు సున్నమువ్రాయుచుండెను. మాధవరావు పనిముగించి భార్యచేయుపనినిజూచి చిరునగవుమోమున నంకురింప మంచినీరునుఅడిగెను. వెంటనే జయలక్ష్మి నీటిచెంబునిచ్చి విడియములు చేతికందిచ్చెను అవి మాధవరావు నములుచు మనప్రభాకరుని స్కూల్ ఫైనల్ వరకు చదివించవలయునన్నాడు జయలక్ష్మి వాడేలాగును చదువుతాడుగాని మన సుబ్బారాయుడుమాత్రము బొత్తిగా బండవాడగుచున్నాడండీ అనెను ఔను బొత్తిగా బండఅవుతున్నాడు. ఇక జాగ్రత్తగాఉండవలెను అని ఆతడు జయలక్ష్మికరముగ్రహించి "జయలక్ష్మి" అని ఊరుకొనెను. ఏమండీ అట్లూరుకొన్నారేమి? నెనేమైన తప్పానర్చేనా? లేక గృహపరిపాలనయందు లోపమున్న క్షమించవలెను అనెను అమాటలువిని మాధవరావు నవ్వుచు నేమియులోపములేదు నీవంటియుత్తమురాలిని నేను భార్యగాబడయుభాగ్యము చేకూర్చినందులకు భగవంతునకు నాకృతజ్ఞతావందనములర్పించుచున్నాను. అని ఆమెను ప్రేమతో నెమ్మదిగాకొట్టెను ఇట్లు జయలక్ష్మి దినములు హాయిగా వెళ్లబుచ్చుచుండెను.

హృదయనైవేద్యము

శ్రీమతి పి. సీతారామమ్మగారు

శా. శ్రీసీతాసతి యంకసీమవరలన్, సింహాసనస్థుండవై
భాసిల్లన్, భరతాదిసోదరులు కొల్వన్, చామరచ్ఛత్రముల్
వాసింగైకొని, చెంత పావని పదాబ్జాతంబుపట్టంగ, సం
తోసంబొప్ప, జగంబునోము, నినుగొల్తున్ రామచంద్రప్రభూ!

మ నను నీభక్తపదాబ్జరేణువను, దీనన్ వ్యాధిసంఛన్నగా
నొనరింపందగునయ్య, నేనునవు భక్త్యోపాసనాగీతముల్
విన నీకిష్టముకాదొ, నాహృదయనైవేద్యంబు, వాక్పుష్పికా
ర్చనమున్ హృద్యముగావొ తెల్పుము, రమేశా! రామచంద్రప్రభూ!

మ పదముల్ నీకు ప్రదక్షిణంబునొనరింపన్, హస్తముల్ మంగళా
స్పదమౌ నీపదమంట, జిహ్వ నిను సంప్రార్థింప, గన్నుల్ నిన్నున్
ముదమొందం గనజాలకున్నను మనమ్మున్ సత్కృపన్ నావశం
వదముంజేసితి వంతెచాలు నిక దేవా! రామచంద్రప్రభూ!